వాకిళ్ళ ద్వారము
For Internal Circulation Only

# నన్నయ వాణి

An in-house Weekly Newsletter
ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్
Accredited by NAAC with 'B+' Grade, ISO 9001 : 2015 & AICTE Certified

www.aknu.edu.in
nannayavani@aknu.edu.in
nannayanewstv
Adikavi Nannaya University
9701293231

గౌరవ సంపాదకులు
ఆచార్య జి.వి.ఆర్.ప్రసాదరాజు
ఉపకులపతి (FAC)

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కుల సచివులు

సంపాదకులు
డా.తలారి వాసు
సహాయాచార్య
తెలుగు శాఖ

పువ్వల ఆనంద్
ప్రజా సంబంధాల అధికారి
కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 3 | సంచిక : 25 | 27-03-2023 | పుటలు : 4

## శ్రీరామ నవమి శుభాకాంక్షలు!!




రామాయణం ఒక రసామృత తరంగిణి. ఆ రసతరంగిణిలో విచిత్రమైన మానవ మనోభావ లహరీ విలాసాలను సహృదయులు మనోనేత్రాలతో తిలకించి ఆనంద పారవశ్యాన్ని పొందుతుంటారు. రాముని మహనీయతను ప్రతిపాదించే వాక్యమే 'రామో విగ్రహవాన్ ధర్మః'. ధర్మస్వరూపాన్ని తెలుసుకోవటానికి, అనుసరించటానికి, అనువర్తింప చేసుకోవటానికి భారతీయ సాహిత్యంలో ఆదికావ్యమైన రామాయణం మనకు ఆధారంగా నిలుస్తోంది.

**వందే వాల్మీకి కోకిలమ్.**

\- నన్నయవాణి

## మంచిమాట



నువ్వు మంచివాడివి అనిపించుకోవడానికి ఇతరులను చెడ్డవాళ్లను చేయకు

# నన్నయలో ఘనంగా 'సవిస్కార 2కె23' మేనేజ్మెంట్ ఫెస్ట్



**25.03.23 (మీడియాసెల్)**

ఆదికవి నన్నయ యూనివర్సిటీ కామర్స్ అండ్ మేనేజ్మెంట్ విభాగం ఆధ్వర్యంలో మేనేజ్మెంట్ ఫెస్ట్ "సవిస్కార 2కె23"ని ఘనంగా నిర్వహించారు. శనివారం యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్ లో జరిగిన ఈ కార్యక్రమాన్ని రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ మాట్లాడుతూ ఆదికవి నన్నయ యూనివర్సిటీ కామర్స్ అండ్ మేనేజ్మెంట్ విభాగం ఆధ్వర్యంలో ప్రతి ఏడాది మేనేజ్మెంట్ ఫెస్ట్ ను నిర్వహిస్తున్నారని దీనిలో భాగంగా ఈ ఏడాది సవిస్కార 2కె 23 పేరుతో ఘనంగా ఫెస్ట్ ను నిర్వహించారని తెలిపారు. ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని ఆయా కళాశాలలకు చెందిన మేనేజ్మెంట్ విద్యార్థులంతా సవిస్కార 2కె23లో హాజరై విజయవంతం చేసారని చెప్పారు. విద్యార్థుల్లోని కమ్యూనికేషన్ స్కిల్స్, ఆర్గనైజింగ్ స్కిల్స్, డెసిషన్ మేకింగ్ వంటి నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయన్నారు. విద్యార్థుల్లోని ఆత్మస్థైర్యాన్ని పెంపొందిస్తూ మేనేజ్మెంట్ స్కిల్స్ అభివృద్ధి చేయడానికి నూతన ఆలోచనల ప్రేరణకు సవిస్కార చక్కని వేదిక అయిందని తెలియజేసారు. ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డా.ఎన్.ఉదయభాస్కర్ మాట్లాడుతూ సవిస్కార 2కె23 మేనేజ్మెంట్ ఫెస్టివల్ కు సహకరించిన స్పాన్సర్స్, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల నాయకత్వంలో ప్రతి ఏడాది యూనివర్సిటీలో మేనేజ్మెంట్ ఫెస్టివల్ జరుగుతుందని తెలియజేసారు. అతిథులను సన్మానించి జ్ఞాపికలను అందజేసి అభినందించారు.



తరువాత అకడమిక్ ఈవెంట్స్ భాగంగా స్పర్థా, యాడ్ మేడ్, బుల్ వజ్ బేర్, ప్లానో, అడ్మినార్, అడ్మెంటార్, టవర్ బిల్డింగ్, సెల్ఫీ టూరిజం, ఫన్ అండ్ మైండ్ గేమ్స్ వంటివి నిర్వహించారు. ఆయా కళాశాలల నుండి విచ్చేసిన విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, ర్యాంప్ వాక్ వంటివి ఆకట్టుకున్నాయి. అనంతరం యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్ బయట యూనివర్సిటీ మేనేజ్మెంట్ విద్యార్థులు నిర్వహించిన ఫ్లాష్ మాబ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ముగింపు సమావేశంలో ఆయా పోటీలలో విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్టులు అందజేసారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రపేపర్ మిల్ జి.ఎం. టేక్సెషన్ చక్రపాణి, చార్టేడ్ అకౌంటెట్ బి.బ్రహ్మానందం,క్యాంపస్ యూనియన్ బ్యాంక్ మేనేజర్ కిశోర్, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.టేకి, డా.ఎన్.ఉదయభాస్కర్, డా.పి.ఉమమహేశ్వరిదేవి, డా.జి.రాజేంద్రప్రసాద్, డా.ఎ.శ్రీపద్మవల్లి, డా.జి.అలీస్ జాయ్, డా.ఎం.రమేష్, డా.ఎం.అమ్మిరెడ్డి, డా.జె.రవిశంకర్, డా.ఐ.సత్యనారాయణరాజు, ఎం.జోహార్ కృష్ణ కె.శ్రీనివాసరావు, డా.శ్రావ్య, తదితరులు పాల్గొన్నారు.

## సంపాదకీయం



# అక్షర నది

రామాయణం మన భారతీయ సమాజంలో ఎన్నో తరాలుగా ఆత్మలకు హత్తుకుపోయిన ఇతిహాసం. వాల్మీకి హృదయం నుంచి శ్లోకంగా వెలువడిన కావ్యం పద్యమై, గేయమై, నాటకమై, కథనమై, జానపదమై, యక్షగానమై, కవితయై వివిధ రూపాల్లో వ్యాప్తి పొంది వర్ధిల్లింది. అక్షర నదిగా ప్రవహించి వివిధ భాషల్లోకి తర్జుమా అయింది.

రఘురాముడు సకల గుణాభిరాముడు. నీలమేఘ శ్యాముడు. భక్త మనోభిరాముడు. ధర్మానికి నిలువెత్తు రూపమై సత్యసంధతకు మారుపేరుగా నిలిచాడు. సమాజానికి సద్వర్తనను, రుజుమార్గాన్ని చూపి ఆదర్శమూర్తి అయ్యాడు. ధర్మాన్ని ఎలా ఆచరించాలో, అర్ధాన్ని ఎలా ఆర్జించాలో, సమున్నత వ్యక్తిత్వంతో ఎలా జీవించాలో రామాయణం మనకు సూచించింది. కుటుంబ వ్యవస్థకు మార్గదర్శకాన్ని అందించింది. అనుబంధాల్ని,ఆచారాల్ని విశ్లేషించింది.

చాలా కాలం క్రితం రామాయణం ఎందుకు చదవాలి? అనే పుస్తకాన్ని చదివినప్పుడు ఒక ఉదాహరణ చాలా సరదా అనిపించింది. రైల్వేస్టేషన్లో ఒక పెద్దాయన స్తంభానికి జారబడి చిన్న పుస్తకాన్ని చదువుకుంటున్నాడు. పక్కనే అరుగు మీద కొత్తగా పెళ్లయిన దంపతులు కూర్చున్నారు. మీరు చదువుతున్నది ఏం పుస్తకమని అడిగాడు. ఇది రామాయణం నాయనా అన్నాడా పెద్దాయన. ఎందుకండీ ఇటువంటి పాత చింతకాయ పచ్చడి చదువుతారు, అవన్నీ పక్కన పెట్టి సైన్స్ చదవండన్నాడు. ముసలాయన అలాగే నాయనా అన్నాడు. ట్రైన్ వచ్చింది అందరూ తోసుకుంటూ ఎక్కేశారు. లోపల అనుకోకుండా పెద్దాయన ప్రక్కనే కూర్చున్నాడు యువకుడు. రైలు కదులుతుంటే ఆదుర్దాపడ్డాడు.అతని భార్య ఇంకా ట్రైన్ ఎక్కలేదు.ప్లాట్ఫాం మీద ఉండి ఎక్కటానికి ప్రయత్నిస్తుంది. వెంటనే ఆ యువకుడు చైన్ లాగాడు. ట్రైన్ ఆగింది. వెళ్లి భార్యను తీసుకొచ్చాడు. కాసేపటికి పెద్దాయన ఆ యువకునితో నీవు రామాయణం చదివి ఉంటే ఈ చిన్న పొరపాటు జరిగి ఉండేది కాదన్నాడు. ఈ సంఘటనకి రామాయణానికి సంబంధం ఏంటి అని ముఖం చిట్లించాడా యువకుడు. ఉంది నాయనా! రామాయణంలో గుహని పడవలో ప్రయాణం చేసే సందర్భంలో ముందు శ్రీరాముడు సీతాదేవిని పడవలోకి ఎక్కించి తర్వాత తాను ఎక్కుతాడు. చివర్లో లక్ష్మణుడు ఎక్కుతాడు. పడవ దిగే సమయంలో కూడా లక్ష్మణుడు ముందు దిగి అన్నగారికి చేయందించాడు.శ్రీరాముడు దిగి సీతాదేవికి చేయందించి క్రిందకి దింపుతాడు.ఈ చిన్న సందర్భంలో ఒక నియమం మనలో అంతర్లీనంగా జీర్ణమవుతుంది. ముందు నీ భార్యను ట్రైన్ ఎక్కించి తర్వాత నీవు ఎక్కాల్సిందనే సందేశం అందులో అంతర్లేనంగా ఉందని నేను భావిస్తున్నానన్నాడు ఆ పెద్దాయన. సరే! ఇది ఒక కథ అనుకుందాం. ఇది జరిగిందా? లేదా? అన్నది ప్రశ్న కాదు.

కుటుంబ జీవన విధానాలు, వైఖరి, మాట, మంచి, చెడు... ఇవన్నీ మన ఇతిహాసాల నిండా,ధార్మిక గ్రంథాల నిండా అంతర్లీనంగా యిమిడ్చి ఉంచారు. హాయిగా, ఆనందంగా జీవించటానికి కావలసిన సూక్ష్మ విషయాలెన్నో మన గ్రంథాల నిండా ఉన్నాయి. వాటిని అందుకోలేకపోవడం, లేదా వాటిని పాటించే ముందు తరాన్నో, పెద్దవాళ్ళనో అనుసరించకపోవడం కూడా తప్పే అవుతుంది. ఏ దేశంలో నైనా ఇతిహాసాలను, ధార్మిక గ్రంథాలను అనుసరించటం తర్వాత తరాలకు అందించడం కర్తవ్యంగా భావించాల్సిన విషయం.

రామాయణం జీవన ప్రయాణాన్ని విశ్లేషించిన గ్రంథం.మనం ఏం గ్రహించగలిగితే అది ఆచరణలో ఫలితాన్నిస్తుంది.శ్రీరామనవమి శుభకామనలు!!

# జాతి నిర్మాణంలో యువతదే కీలక పాత్ర

**20.03.23 (మీడియాసెల్)**

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎం.ఎస్.ఎన్ క్యాంపస్ లో ఈనెల 23వ తేదీ సోమవారం, నెహ్రూ యువ కేంద్రం కాకినాడ జిల్లా వారి సౌజన్యంతో రాజనీతి మరియు ప్రభుత్వ పాలనా శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో యూత్ పార్లమెంట్ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపల్ డా. కమల కుమారి అధ్యక్షత వహించారు. ఈ సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఉపకులపతి ఆచార్య జివిఆర్ ప్రసాదరాజు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతి నిర్మాణంలో యువతదే కీలక పాత్ర అని, విశ్వవిద్యాలయాల్లో ఉన్న యువత తమ శక్తి సామర్థ్యాలను, మేధాసంపత్తిని పెంపొందించుకొని దేశాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. దేశంలో ప్రజాస్వామ్య అభివృద్ధికి యువత భాగస్వామ్యాన్ని కలిగి చురుకైన పాత్ర పోషించాలని కోరారు. యూత్ పార్లమెంట్లు నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో ఉన్న ఆలోచన సామర్థ్యాలను పెంపొందించడానికి స్ఫూర్తిదాయకమైన కార్యక్రమాలు నిర్వహిస్తున్న నెహ్రూ యువ కేంద్రం కాకినాడ జిల్లా మరియు కార్యక్రమ సమన్వయకర్తగా వ్యవహరించిన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎమ్మెస్ఎన్ క్యాంపస్ రాజనీతి మరియు ప్రభుత్వ పాలనా శాస్త్ర విభాగాన్ని ఆయన అభినందించారు. ఇటీవల మృతి చెందిన విభాగ సహాయ ఆచార్యులు డాక్టర్ మద్దా సత్యనారాయణ లేని లోటు స్పష్టంగా కనిపిస్తుందని అన్నారు. కార్యక్రమ ఉద్దేశాన్ని కన్వీనర్ మరియు కోర్సు కోఆర్డినేటర్ డా. కె. జోసెఫ్ స్టీఫెన్ వివరించారు. ఇటీవల కన్నుమూసిన విభాగ సహాయ ఆచార్యులు డాక్టర్ మద్దా సత్యనారాయణకు ఈ కార్యక్రమాన్ని అంకితమిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్ కె. కృష్ణార్జునరావ్ నైపుణ్యాభివృద్ధి, స్టార్టప్ వంటి అంశాలు గూర్చి సవివరంగా తెలియజేశారు. మరో వక్త కాకినాడ బార్ కౌన్సిల్ అసోసియేషన్ అధ్యక్షులు ఏలూరి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ చట్టాలలో ఉన్న ఔన్నత్యాన్ని గురించి మహిళలు ముఖ్యంగా విద్యార్థినులు ఏ విధంగా వాటిని ఉపయోగించుకోవాలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ ప్రశాంతిశ్రీ, విభాగ అధ్యాపకులు డా. కె. హరిబాబు, డా.ఎం. గోపి, డా.పి.రాజ్ కుమార్ రెడ్డి, మరియు డా.ఎం. పోచయ్య, నెహ్రూ యువ కేంద్రం ప్రతినిధి సూరపరెడ్డి సత్యసూర్య, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు ఆసక్తిగా పాల్గొన్నారు. క్యాంపస్ లోని వివిధ విభాగాల విద్యార్థుల ఆధ్వర్యంలో నమూనా పార్లమెంటును నిర్వహించారు. ఏ.ఎస్.డి మహిళా డిగ్రీ కళాశాల రాజనీతి శాస్త్ర అధ్యాపకురాలు శ్రీమతి భువనేశ్వరి దేవి ఆధ్వర్యంలో విద్యార్థినిలు రాష్ట్ర అంశాలపై చర్చలో పాల్గొన్నారు.













# కమ్యూనికేషన్ సిస్టమ్స్‌పై సెమినార్

ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ డిపార్ట్మెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో 'ఇంట్రడక్షన్ టు కమ్యూనికేషన్ సిస్టమ్స్' అనే అంశంపై ఒకరోజు సెమినార్ ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.పి.వెంకటేశ్వరరావు, రిసోర్స్ పర్సన్ ఐఐటి గౌహతి ఆచార్యులు డా.సర్వేంద్రనాథ్ కమ్యూనికేషన్ సిస్టమ్స్ ప్రాధాన్యాన్ని వివరించారు. కమ్యూనికేషన్ రంగంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఏ విధంగా ఉపయోగించి అభివృద్ధి సాధిస్తున్నారనే పదం అంశాలను క్షుణ్ణంగా వివరించారు. ఇంజనీరింగ్ విద్యార్థులకు కమ్యూనికేషన్ టెక్నాలజీపై పట్టు సాధించి అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. అనంతరం ఆయనను సన్మానించి జ్ఞాపికను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో సభాధ్యక్షులు బి.కృష్ణ కన్వీనర్ విభాగ కోర్స్ కోఆర్డినేటర్ బి. సుధాకిరణ్, కో కన్వీనర్లు హాజరయ్యారు.



# పొలిటికల్ సైన్స్ ఫ్రెషర్స్ పార్టీ


ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిపార్ట్మెంట్ ఆఫ్ పొలిటికల్ సైన్స్ ఆధ్వర్యంలో సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు ఫ్రెషర్స్ పార్టీ నందించి ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు,అధ్యాపకులు పాల్గొన్నారు.







# డిపార్ట్మెంట్ ఆఫ్ జియో సైన్సెస్ ఫ్రెషర్స్ పార్టీ



## అశ్రువు

కన్నీటికి కారణం... ఎందుకొస్తుంది..కన్నీరు?
నాకేం తెలీదనే ధీమాతోనా..
నా వల్ల ఏ ప్రయోజనం లేదనే బాధతోనా...
నేనేమైనా చేయగలననే నమ్మకంతోనా...
ఎవరైనా ఆలోచిస్తున్నారా..?సమాజంలో
జరుగుతున్న అన్యాయాలను చూసేమో..
లేదా..మంచితనం చనిపోతున్నందుకా...
మహిళల జీవితాలు బలవుతున్నందుకా...
లేదా..మగవాళ్ల బానిస బ్రతుకులను చూసి
వస్తుందా?
చిన్నపిల్లల్ని కూడా చిదిమేస్తున్నందుకా...
అమ్మ నాన్నలని అనాధాశ్రమాల్లో
వదిలిపెడుతున్నందుకా...
దేశాన్ని మోసంచేస్తున్న వారిని చూసి
వస్తుందా? నేరాలు ఎక్కువవుతున్నందుకా...
పెరిగిన ధరలను చూసి వస్తుందా?
తరగని సమస్యల వలనా..
ఎందుకొస్తుందీ కన్నీరు?
ఎందుకో తెలియకుండా వస్తుంది..

- బి.సుశాంత్ కుమార్

# సవిస్కార్ 2 కె 23

## విద్యార్థుల చిత్రమాలిక









సవిస్కారం మేనేజ్మెంట్ ఫెస్ట్ ఓవరాల్ ఛాంపియన్షిప్ కైవసం చేసుకున్న ఆదిత్య స్కూల్ ఆఫ్ మేనేజ్మెంట్ స్టడీస్ విద్యార్థులు.









ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in